క్లుప్తంగా

వామకుంట్లలో ఉపాధి కూలీల ఆందోళన



తిరువూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న తమకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ఉపాధి కూలీలు మండలంలోని వామకుంట్లలో సోమవారం ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పనికి తగిన వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కేరళ తరహాలో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే సంక్షేమ నిధి కూడా ఏర్పాటు చేయాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సాంబారు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మిక నేతకు నివాళి



తిరువూరు: జైభీమ్ ఆర్టీసీ కార్మిక యూనియన్ తిరువూరు డిపో కార్యదర్శి వీ శాంసన్ మృతికి డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యం, కార్మికులు సంతాపం వ్యక్తం చేశారు. తిరువూరు బస్‌స్టాండు ఆవరణలో యూనియన్ అడ్‌హాక్ కమిటీ కార్యదర్శి ఏసుపాదం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సంతాప సభలో డీఎం మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి శాంసన్ నిరంతరం పాటుపడ్డారని పేర్కొన్నారు. కార్మిక సంఘ నాయకులు బంకా లాబాను, కొత్తపల్లి రామారావు, ఎస్వై రావు తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడికి విశేష పూజలు



తిరువూరు: జ్యేష్ఠ మాస శివరాత్రి సందర్భంగా తిరువూరు శ్రీరామలింగేశ్వరాలయంలో సోమవారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు భవాని రాధాకృష్ణ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి పరమేశ్వరుడికి, నందీశ్వరుడికి పంచామృతాలతో అభిషేకం, నమక చమకం, రుద్రాభిషేకం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బెస్ట్ యోగా టీచర్‌గా జనార్దన్



ఇబ్రహీంపట్నం: తమిళనాడు స్పోర్ట్స్ యోగాసన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంకు చెందిన ప్రముఖ యోగా గురువు, శాంతివన్ యోగా ఫౌండేషన్ అధ్యక్షుడు లంకె జనార్దన్ బెస్ట్ యోగా టీచర్‌గా అవార్డు అందుకున్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని చెన్నై వెస్ట్ మాంబాలం మూగాంబిగయ్ హాలులో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో 11వ బెస్ట్ యోగా టీచర్ అవార్డుతోపాటు జీవిత సాఫల్య పురస్కారం అందజేసి జనార్దన్‌ను సత్కరించారు. అసోసియేషన్ కార్యదర్శి, యోగాచార్య రవి ఆరుముగం మాట్లాడుతూ ప్రతి ఏటా తమిళనాడు, తమిళనాడేతర రాష్ట్రాల నుంచి పలువురు యోగా టీచర్లకు బెస్ట్ యోగా టీచర్ అవార్డు అందజేస్తున్నట్లు తెలిపారు. అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మారెమ్మ ఆలయానికి టీవీ, రూ.10వేలు విరాళం



ఇబ్రహీంపట్నం: భారత్ పెట్రోల్ బంక్ యజమాని రాజశేఖర్ స్థానిక మారెమ్మ అమ్మవారి ఆలయానికి సోమవారం టీవీ, రూ. 10,116లు ఆర్థిక సాయం అందజేశారు. వార్డు కౌన్సిలర్ రావి ఫణి, కాంతారావు కోరిక మేరకు ఆలయానికి ఆర్థిక సాయం అందజేసినట్లు బంకు యజమాని రాజశేఖర్ తెలిపారు. దేవాలయానికి సాయం అందించేందుకు కృషి చేసిన రావి ఫణి, కాంతారావులకు దేవాలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం

- కూలడానికి సిద్ధంగా ఎన్నెస్పీ క్వార్టర్లు
- వర్షాలకు నానుతున్న శిథిల భవనాలు

నూజివీడు: అసలే వర్షాకాలం... తరచూ ముసురుపట్టి మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పట్టణంలోని కాలం చెల్లిన ఎన్నెస్పీ భవనాలు ఎప్పుడైనా కూలడానికి సిద్ధం అన్నట్లుగా దర్శనమిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో శిథిలావస్థకు చేరిన ఎన్నెస్పీ క్వార్టర్లను కూల్చకుండా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం పక్కన ఉన్న ఎన్నెస్పీ క్వార్టర్ల జీవితకాలం పూర్తయి దశాబ్ద కాలం గడిచినా వాటిని తొలగించే విషయమై అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదు. దీంతో అవి రోజురోజుకు మరింత శిథిలావస్థకు చేరడం, శ్లాబులు కుంగిపోవడం, పెచ్చులూడి పడిపోవడం, వర్షాలకు నాని నిర్మాణాలు కూలిపోవడం జరుగుతున్నాయి. కొన్ని ఫ్లాట్లు అయితే కూలిపోవడం కూడా జరిగింది. ఇటీవలే ఒక ఫ్లాట్ కూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఎలాంటి ప్రమాదం సంభవించక ముందే కూల్చేస్తే బాగుంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..

నూజివీడు ప్రాంతంలో ఎన్నెస్పీ కాలువలు నిర్మించేందుకు గాను 1977లో సబ్‌డివిజన్ కార్యాలయాలను ఏర్పాటు చేసి సిబ్బంది ఉండటానికి గాను ఎల్ఐసీ కార్యాలయం పక్కన 1980లో క్వార్టర్స్‌ను నిర్మించారు. దాదాపు ఆరు ఎకరాల స్థలంలో 80 కుటుంబాలు నివసించడానికి గాను క్వార్టర్లను 25 సంవత్సరాల కాలపరిమితితో అప్పట్లో నిర్మించడం జరిగింది. దీంతో వీటి జీవిత కాలం 2005తోనే పూర్తయి రెండు దశాబ్దాలు దాటినా ఇప్పటికీ వాటిని కూల్చకుండా అలానే వదిలేశారు. 2018 వరకు సిబ్బంది నివాసముండగా ఆ తర్వాత వాటిని ఖాళీ చేసి వెళ్లిపోయారు. ముసురు పట్టి నిరంతరం పడే జల్లులకు శిథిలావస్థకు చేరిన ఈ క్వార్టర్లు నానిపోయి కూలిపోయే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ క్వార్టర్ల ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన నేపథ్యంలో ఇవి కూలిన సమయంలో ప్రాణాపాయం సంభవించే ప్రమాదం లేకపోలేదు. క్వార్టర్స్ సమీపంలోనే ప్రైవేటు డిగ్రీ కళాశాల సైతం ఉంది. విద్యార్థులు, స్థానికులు నిత్యం ఈ ప్రాంతంలో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన క్వార్టర్స్‌ను కూల్చివేయాలనే డిమాండ్ స్థానికుల నుంచి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరి ఇటీవల కూలిన ఎన్నెస్పీ క్వార్టర్స్‌లోని ఒక భవనం



కూలడానికి సిద్ధంగా ఉన్న మరో భవనం

ఒక్కొక్కటిగా కూలుతున్నాయి



ఎన్నెస్పీ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరి వర్షాలకు నానుతూ ఒక్కొక్కటిగా కూలుతున్నాయి. అంతేకాకుండా పాములకు నిలయంగా మారడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు సైతం అడ్డాగా ఉంది. క్వార్టర్స్ ఎలాగూ కాలం చెల్లిపోయిన నేపథ్యంలో వాటిని వెంటనే కూల్చేస్తేనే మంచిది.

– గంపా విజయ్, ఎంప్లాయీస్ కాలనీ, నూజివీడు

కోరం లేకుండానే మండల పరిషత్ సమావేశం

నూజివీడు: నూజివీడు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశాన్ని కోరం లేకుండానే నిర్వహించారు. ఎంపీపీ ఆరేపల్లి శిరీష అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశంలో కేవలం ఎంపీపీ, వైస్ ఎంపీపీ అక్కినేని శ్రీవాణి, దేవరగుంట ఎంపీటీసీ సభ్యుడు నక్కా శ్రీనివాసరావు మాత్రమే హాజరవ్వగా సమావేశాన్ని నిర్వహించడం గమనార్హం. నూజివీడు మండల ప్రజా పరిషత్‌లో 20 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. కోరం ప్రకారం 51 శాతం మంది సభ్యులు హాజరవ్వాల్సి ఉండగా కేవలం ముగ్గురు మాత్రమే హాజరైనా సమావేశం నిర్వహించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కోరం లేదని తెలిసి కొందరు నాయకులు అప్పటికప్పుడు ఫోన్‌లు చేస్తే సమావేశం ప్రారంభమైన గంట సేపటికి అన్నవరం, యనమదల ఎంపీటీసీ సభ్యులు వచ్చారు. అయినప్పటికీ కోరం పూర్తికాలేదు. కోరం లేనప్పుడు కొంతసేపు వేచి చూసి అప్పటికి రాకపోతే సమావేశాన్ని వాయిదా వేసి మరో రోజు నిర్వహించాలి. కానీ కోరం లేనప్పటికీ నిర్వహించడం గమనర్హం.



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు

సాంస్కృతిక, కళారంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

విజయవాడ కల్చరల్: వాసవీ సేవా సంస్థలు సామాజిక సేవతో పాటు సాంస్కృతిక కళారంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆ దిశగా కార్యాచరణ చేయాలని వాసవీ సేవా సంస్థల అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా సూచించారు. వాసవీ క్లబ్ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల సభ్యుల సమాలోచన కార్యక్రమం ఉదయాస్తమాన సేవలు 48 గంటలపాటు నిర్వహించిన నిర్విరామ సేవలు సోమవారం ముగిశాయి. గాంధీనగర్‌లో జరిగిన సమావేశంలో గుప్తా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని 35 శాఖల ద్వారా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆయా జిల్లాల్లోని అన్ని ప్రధాన నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ తాగునీరు, వైద్య సేవలను అందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్ బెంచీలు నిర్మాణం చేశామని, పేద కళాకారులకు నెల వారీ నిత్యావసర వస్తువులను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వేముల హజరత్తయ్య గుప్తాను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. సమీక్ష సమావేశంలో వాసవీ క్లబ్ కీలక నిర్వాహకులు మాజేటి హరిప్రసాద్, దర్భి శ్రీనివాసరావు, ముదుపల్లి భాస్కర్, కొత్తమాసు విశ్వనాథం, కె.సుజాత లక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేద కళాకారులకు నిత్యావసరాలను అందించారు.

ఏరియా ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా పద్మజారాణి



నూజివీడు: పట్టణంలోని ఏరియా ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ జీ పద్మజారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు సూపరింటెండెంట్‌గా పనిచేసిన డాక్టర్ నరేంద్రసింగ్ తెనాలి జిల్లా ఆసుపత్రికి బదిలీపై వెళ్లారు. దీంతో స్థానిక ఏరియా ఆసుపత్రిలో మత్తు వైద్యులుగా పనిచేస్తున్న పద్మజారాణికి సూపరింటెండెంట్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

రేపు సోషల్ ఆడిట్

జి.కొండూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై ఈ నెల 25వ తేదీన సోషల్ ఆడిట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణనాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు మండల పరిధిలోని 22 గ్రామ పంచాయతీల్లో జరిగిన పనులపై ఆడిట్ జరుగుతుందని పేర్కొన్నారు.

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని నున్న పోలీసు స్టేషన్ సీఐ పి.కృష్ణమోహన్ సూచించారు. నవజీవన్ బాల భవన్, ఎన్టీఆర్ జిల్లా ఈగల్ టీమ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ప్రచార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిస కారాదని, బంగారం లాంటి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. మత్తుపదార్థాల వల్ల ఆరోగ్యం క్షీణించడంతో పాటు సామాజికంగా, ఆర్థికంగా నష్టపోయి కుటుంబాలు సత్సంబంధాలను కోల్పోతాయన్నారు. సరైన అవగాహన లేక అనేక మంది యువకులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివి జీవితంలో మంచిగా స్థిరపడాలని ఆకాంక్షించారు. జిల్లా ఈగల్ టీమ్ సీఐ టి.ధనుంజయ్ నాయుడు మాట్లాడుతూ డ్రగ్స్, కొకైన్, గంజాయి లాంటివి మీ చుట్టుపక్కల ఎవరైనా విక్రయించినట్లు తెలిస్తే పోలీస్, 1972కి సమాచారం అందించాలని కోరారు. నవజీవన్ బాలభవన్ ప్రతినిధి గోళ్లమూడి శేఖర్‌బాబు, కాలేజీ ప్రిన్సిపాల్ జి.సంధ్యామాధురి తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం



ముసునూరు: హైస్కూల్ విద్యార్థుల సౌకర్యం కోసం బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ వర్గాలు తెలిపాయి. మండలంలోని గుడిపాడు హైస్కూల్‌లో చదువుతున్న గుళ్లపూడి, వలసపల్లి విద్యార్థుల కోసం ఏలూరు నుంచి బస్సు సర్వీసును గుళ్లపూడి మీదుగా నడుపుతున్నట్లు తెలిపారు. ఏలూరు నుంచి వలసపల్లి, గుళ్లపూడి, గుడిపాడు, చెక్కపల్లి వరకు ఉదయం, సాయంత్రం వేళ నడుస్తుందని చెప్పారు. బస్సు సర్వీసు ఏర్పాటుకు కృషి చేసిన గ్రామ పెద్దలు రాయంకుల రామారావు తదితరులకు హెచ్ఎం కె.నాగబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా

నూజివీడు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రత్యేకాధికారి పీ రజిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, ఇంటర్ ఆ పైన చదివిన నిరుద్యోగ యువత బయో డేటా, విద్యార్హత కలిగిన ధ్రువపత్రాల జిరాక్స్‌తో జాబ్‌మేళాకు హాజరు కావాలని సూచించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నేడు సత్యసాయి ప్రేమ వాహిని రథయాత్ర

తిరువూరు: భగవాన్ సత్యసాయిబాబా ప్రేమ వాహిని రథయాత్రను మంగళవారం తిరువూరు మండలంలో నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ దామెర్ల ప్రభాకరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజామున ఐదు గంటలకు సత్యసాయి మందిరంలో సుప్రభాత సేవ, ఓంకార ధ్యానం, నగర సంకీర్తన జరుగుతుందని చెప్పారు. అనంతరం ఉదయం ఏడు గంటలకు ప్రధాన వీధుల మీదుగా విస్సన్నపేటకు రథయాత్ర జరుగుతుందని వెల్లడించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ సమావేశం

మైలవరం: వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి జోగి రమేష్ ఆదేశాల మేరకు రెడ్డిగూడెం మండలం రంగాపురం గ్రామంలో మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు గ్రామ కమిటీ సమావేశం జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుప్పిరెడ్డి వెంకటరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావలసిందిగా ఆయన కోరారు.


కూలింగ్ వాటర్ ఫ్రిడ్జ్ అందజేత

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని కృష్ణచేతన్ అప్పర్ ప్రైమరీ పాఠశాలకు కూలింగ్ వాటర్ ఫ్రిడ్జ్‌ను బీజేపీ నాయకులు సోమవారం అందజేశారు. విద్యార్థుల సౌకర్యార్థం బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు మారాసు కృష్ణమోహన్ పాఠశాలకు కూలింగ్ వాటర్ ఫ్రిడ్జ్ అందించారు. మైలవరం నియోజకవర్గం ఆర్ఎస్ఎస్ ఇంచార్జ్ ఎస్.సూరజ్, కన్నా నాగరాజు, చల్లా ఆంజనేయులు, కరుకుమల్లి సత్యవతి, నక్కా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాత వాహనాల వేలంతో రూ.1.33 లక్షల ఆదాయం

నూజివీడు: ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన పాత వాహనాలను బహిరంగ వేలం వేయడం ద్వారా రూ. 1,33,458 ఆదాయం వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో ఏఈఎస్ జీ.పాండురంగారావు సమక్షంలో నిర్వహించిన ఈ బహిరంగ వేలంలో 17 వాహనాలు వేలం వేశామని చెప్పారు. వీటికి ప్రభుత్వం నిర్ణయించిన రూ. 1,02,500 ధరకు వేలంలో రూ. 1,13,000 వచ్చిందని దీనికి 18 శాతం జీఎస్టీ కలుపుకొని రూ. 1,33,458 ఆదాయం లభించిందని పేర్కొన్నారు.

గడువులోగా అర్జీలు పరిష్కరించాలి



నూజివీడు: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ సూచించారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీల పరిష్కారానికి నిర్దిష్ట కాలపరిమితి విధించామని, గడువులోగా తప్పనిసరిగా అర్జీలకు నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. ఒకవేళ గడువులోగా సమస్యను పరిష్కరించలేకపోతే దానికి సంబంధించిన సరైన కారణాన్ని తెలియజేయాలని పేర్కొన్నారు. కాగా ప్రజల నుంచి 21అర్జీలు రాగా వాటిని సంబంధిత అధికారులకు పంపారు.

మర్యాదపూర్వక కలయిక

మైలవరం: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్‌ను మైలవరం నియోజకవర్గం రెడ్డిగూడెం మండలానికి చెందిన పార్టీ మండల అధ్యక్షుడు కుప్పిరెడ్డి వెంకటరెడ్డి నేతృత్వంలో పలువురు నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెడ్డిగూడెం మండలంలోని పలు సమస్యలు, పార్టీ పరిస్థితులను వెంకటరెడ్డి వివరించారు. క్షేత్ర స్థాయిలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని అవినాష్ చెప్పినట్లు నాయకులు పేర్కొన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటామని హామీనిచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతు విభాగం మైలవరం నియోజకవర్గ అధ్యక్షుడు ఉయ్యూరు సత్యనారాయణరెడ్డిని అవినాష్ శాలువతో సత్కరించారు. వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి, రెడ్డిగూడెం వైస్ ఎంపీపీ చాట్ల రాబర్ట్, జిల్లా కార్యదర్శి, రెడ్డిగూడెం ఎంపీటీసీ సభ్యుడు కుప్పిరెడ్డి వరప్రసాదరెడ్డి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు గుడిశె ప్రభాకరరెడ్డి, యువ నాయకుడు కులదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దేవినేని అవినాష్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ రెడ్డిగూడెం మండల నాయకులు

ప్రభుత్వ పాఠశాలల విలీనం సరికాదు

విస్సన్నపేట: స్థానిక బీసీ కాలనీలో ఉన్న ఎంపీపీ పాఠశాలను విలీనం పేరుతో విద్యార్థులను విద్యకు దూరం చేయవద్దని సీపీఎం మండల కార్యదర్శి వీ నాగరాజు పేర్కొన్నారు. ఈ మేరకు పాఠశాల ముందు సీపీఎం ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులతో కలిసి సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కాలనీలో గత 34 ఏళ్లుగా ఉన్న ఎంపీపీ పాఠశాలను విలీనం పేరుతో 3, 4, 5 తరగతులను తీసివేయడం వల్ల కేవలం ఒకటి, రెండు తరగతులు చదివే విద్యార్థులు కేవలం 9 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. ఈ పాఠశాలలో 3, 4, 5 తరగతులు లేకపోవడంతో విద్యార్థులు దూరంగా ఉన్న పాఠశాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలవైపు మొగ్గుచూపుతున్నారని ప్రభుత్వం ఈ జీవోను వెంటనే రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సంఘం మండల కార్యదర్శి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల ముందు ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు

'యువత పోరు'కు తరలివెళ్లిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

ఆగిరిపల్లి: యువత పోరు ధర్నా కార్యక్రమానికి మండలం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, యువకులు అధిక సంఖ్యలో ఏలూరుకు తరలి వెళ్లారు. మండల అధ్యక్షుడు బెజవాడ రాంబాబు ఆధ్వర్యంలో సోమవారం కార్లు, ద్విచక్ర వాహనాల్లో ర్యాలీగా ఏలూరుకు వెళ్లారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లగాని నరసింహారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది గడుస్తున్నా యువతకు ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మచ్చా హరిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు, ఎంపీటీసీ సభ్యుడు గుర్రం శ్రీనివాసరావు, సర్పంచులు వేము రాజు, లింగవరపు రమేష్, కందుల విక్రమ్, నాయకులు నందూరి భాస్కర ప్రసాద్, గుండ్ల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



యువత పోరుకు వెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పేదలకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు

నూజివీడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు పేదలకు వ్యతిరేకంగా ఉంటున్నాయని, అభివృద్ధి కాగితాల పైనే కానీ ఆచరణలో ఉండటం లేదని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక అమర్ భవన్‌లో పార్టీ నాయకుడు శిఖా ఆకాష్ అధ్యక్షతన సీపీఐ నూజివీడు పట్టణ మహాసభను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామారావు మాట్లాడుతూ దేశంలో కార్మిక, కర్షక వర్గాలు సంపద ఉత్పత్తి కేంద్రాలుగానే మిగిలిపోతున్నాయన్నారు. సంక్షేమ పథకాల మాయలో ప్రజలను ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయన్నారు. 11 ఏళ్ల మోడీ పాలనలో ప్రజలపై భారాలు తప్ప మరొకటి లేదని టాక్స్‌ల పేరుతో ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నారని విమర్శించారు. పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు మాట్లాడుతూ కార్మిక వర్గ సమస్యలపై వచ్చేనెల 9వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గాలు ఐక్యంగా పాల్గొని ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నూజివీడు నియోజకవర్గ అధ్యక్షుడు అక్కినేని ఆంజనేయ ప్రసాద్, రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి మడిపల్లి నాగేంద్రరావు, నాయకులు పల్లె ప్రేమ్‌కుమార్, ప్రవీణ్, మాదిరెడ్డి శ్రీనివాసరావు, బీ వెంకటేశ్వరరావు, ముత్యాల విజయ్, శ్యామల, శోభ, సునీత, తాహిరున్నిసా, లక్ష్మి, రమణ, పద్మ, రమాదేవి, చిన్నమణి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు

చినుకు పడితే చిత్తడే

చాట్రాయి: చినుకు పడితే చాలు చిత్తడిలా మారుతున్నాయి కాలనీల్లోని మట్టి రోడ్లు. మండలంలోని చనుబండ బీసీ కాలనీలోకి వెళ్లే అంతర్గత రోడ్డు బురదమయంగా మారింది. తాగు నీటి కోసం ఈ మార్గం నుంచి నిత్యం కాలనీవాసులు రాకపోకలు నిర్వహిస్తుంటారు. ఈ బురద రోడ్డుపై తాగు నీటి కోసం రావాలంటే నానా ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సూరంపాలెం బీసీ కాలనీ రోడ్లు గుంతలు పడి బురదమయంగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా మట్టి రోడ్లపై గ్రావెల్ వేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



బురదమయంగా మారిన చనుబండ బీసీ రోడ్డు

26 నుంచి సంగీత సద్గురువుల ఆరాధనా మహోత్సవాలు

విజయవాడ కల్చరల్: సంగీత సద్గురువులు సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రి 108, పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 74వ వర్ధంతి సందర్భంగా శిష్యప్రశిష్య బృందం ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీ గురువారం నుంచి 30వ తేదీ మంగళవారం వరకు సంగీత మహోత్సవాలు నిర్వహిస్తునట్లు కన్వీనర్ మోదుమూడి సుధాకర్ తెలిపారు. విజయవాడలోని శివరామ కృష్ణ క్షేత్రంలో ప్రతి రోజూ సాయంత్రం సంగీత కార్యక్రమాలు జరుగుతాయని సద్గురు త్యాగరాజ స్వామి శిష్య పరంపరకు చెందిన వారు 100 మంది ఉత్సవంలో పాల్గొంటారని తెలిపారు. 28వ తేదీ ఉదయం అలంకార్ సెంటర్‌లోని పారుపల్లి రామకృష్ణయ్య పంతులు విగ్రహం వద్ద పుష్పాంజలి, 29వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు త్యాగరాజస్వామి రచించిన ఘన పంచ కృతుల గోష్ఠిగానం ఉంటుందని తెలిపారు.